ఐఐఎం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి
ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌తో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

మామిళ్లగూడెం, అక్టోబర్ 18 : రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ రాష్ట్రంలో ఐఐఎం ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర కోరారు. శుక్రవారం ఢిల్లీలోని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను ఆయన నివాసంలో కలిసి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్రంలో ప్రతి జిల్లాకు ఒక నవోదయ విద్యాలయం మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 23 జిల్లాల్లో నవోదయ పాఠశాలలు నెలకొల్పాలని కోరడంతో సానుకూలంగా స్పందించి మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మామిళ్లగూడెం, అక్టోబర్ 18 : ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో 48వ డివిజన్ గణేష్‌నగర్‌లో ఇటీవల వచ్చిన వరద తాకిడికి పాడైపోయిన రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణానికి శుక్రవారం స్థానిక కార్పొరేటర్ తోట గోవిందమ్మ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వరద సహాయ నిధులు నుంచి మంజూరు చేసిన పది లక్షల రూపాయలతో పనులు చేపడుతున్నట్లు మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు.

హిందుత్వ ఫాసిస్ట్ భావజాలం ప్రమాదకరం
సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ముదిగొండ, అక్టోబర్ 18: హిందుత్వ ఫాసిస్ట్ భావజాలం దేశానికి ప్రమాదకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండలంలోని అమ్మపేటలో శుక్రవారం జరిగిన ఆ పార్టీ మండల మహాసభలో ఆయన ప్రసంగించారు. మతం పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను రెచ్చగొట్టి విద్వేషాలు సృష్టిస్తుందని విమర్శించారు. ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ హామీలు గాలికొదిలి మూసి సుందరీకరణ, హైడ్రా పేరుతో డ్రామాలు చేస్తుందని అన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేజీబీవీను సందర్శించిన చైల్డ్‌డెవలప్‌మెంట్ ఆఫీసర్

విద్యార్థినులకు సూచనలు చేస్తున్న చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్

ఎర్రుపాలెం, అక్టోబర్ 18: మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల పాఠశాలను చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(జీసీడీవో) తులసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సివిల్ వార్క్స్‌ను పరిశీలించి కాంట్రాక్టర్‌తో మాట్లాడి వారం రోజుల్లో మిగిలిన వర్క్ పూర్తి చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న ఇంగ్లీష్, మ్యాథ్స్, కెమిస్ట్రీ పోస్టులను నెల రోజుల్లో భర్తీ చేస్తామన్నారు. విద్యార్థునులు ఒక లక్ష్యం పెట్టుకొని ఉన్న సౌకర్యాలను ఉపయోగించుకొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు.

సత్తుపల్లి డిపో చరిత్రలో రికార్డుస్థాయి ఆదాయం

సత్తుపల్లి, అక్టోబర్ 18: సత్తుపల్లి ఆర్టీసీ డిపో చరిత్రలో రికార్డు స్థాయిలో గురువారం రూ.33,58,658 ఆదాయం వచ్చిందని డిపో మేనేజర్ యు రాజ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం డిపోలో ఆమె మాట్లాడారు. అత్యధిక ఈపీకే 69.68, అత్యధిక ఓఆర్ 109, అత్యధికంగా 47,788 కిలోమీటర్లు తిరిగినట్లు ఆమె పేర్కొన్నారు. దసరా పండుగ సందర్భంగా సత్తుపల్లి డిపోలో ఈ నెల 1 నుంచి 16వ తేదీ వరకు షెడ్యూల్ బస్సులే కాకుండా అదనంగా 109 స్పెషల్ బస్సులు ఆపరేట్ చేయగా రూ.80,83,781 వచ్చిందన్నారు.

ఎంపీడీవో బదిలీ

వేంసూరు, అక్టోబర్18: వేంసూరు ఎంపీడీవోగా పనిచేస్తున్న రమాదేవి బదిలీపై బోనకల్లు మండలానికి వెళ్లారు. వేంసూరు ఎంపీడీవోగా సత్తుపల్లి ఎంపీడీవో పనిచేస్తున్న నాగేశ్వరరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీడీవోగా నాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు.

పత్తిలో పచ్చదోమ తాకిడి

కారేపల్లి, అక్టోబర్18: పత్తిలో పచ్చదోమ తాకిడి ఎక్కువగా ఉందని వైరా కృషి విజ్ఞాన కోఆర్డినేటర్ డాక్టర్ కే రవికుమార్, శాస్త్రవేత్తలు పీఎస్ఎం ఫణిశ్రీ తెలిపారు. శుక్రవారం మండలంలోని గేటురేలకాయలపల్లి ప్రాంతంలో పత్తి, మిర్చి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కువ వర్షపాతం, తక్కువ ఉష్ణోగ్రతలు వాతావరణంలో పచ్చదోమ ఉధృతి ఎక్కువ రసాన్ని పీల్చుతున్నాయని, దీంతో ఆకులు ముడుచుకుపోవడం, లేత పసుపురంగులోకి మారి ఆకు ఎండిపోతున్నాయన్నారు. ఏడీఏ టీ కరుణశ్రీ, ఏవో బీ.అశోక్‌కుమార్, ఏఈవో బీ.నరేష్ పాల్గొన్నారు.

విధుల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలి
కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం : మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం వ్యవసాయం : బాలల సదనం పిల్లలతో కలెక్టర్

మామిళ్లగూడెం, అక్టోబర్ 18: ప్రభుత్వంలో పని చేస్తున్నప్పుడు విధుల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని, మనం చేసే పనివల్ల ప్రజల సమస్యలు దూరమవుతాయనే ధృక్పథంతో నిరంతరం ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పెండింగ్ రెవెన్యూ అంశాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దరఖాస్తులు, మీ సేవా దరఖాస్తులు, ధరణి దరఖాస్తులు, పెండింగ్ మ్యూటేషన్, ప్రభుత్వ స్థలాలు, కోర్టు కేసులు మొదలగు అంశాలపై కలెక్టర్ సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఆర్‌వో రాజేశ్వరి, కల్లూరు ఆర్డీవో రాజేందర్, కలెక్టరేట్ ఏవో ఆరుణ పాల్గొన్నారు.

పథకాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం నగరంలోని బాలల సదనం ఎదురుగా ఉన్న లాండ్రీషాపును సందర్శించి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. బీసీ కార్పొరేషన్ రుణం పొంది షాపు వసతులు పెంచుకోవాలని సూచించారు.

'చెకుముకి సైన్స్' గోడపత్రిక ఆవిష్కరణ

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 18 : మూఢనమ్మకాలను తొలగించి సమాజంలో మార్పు తీసుకరావడానికి విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడంలో ఉపాధ్యాయులు ముఖ్య పాత్ర పోషించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబురాల గోడ పత్రికను శుక్రవారం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో కలెక్టర్ ఆవిష్కరించారు. పిల్లల్లో శాస్త్రీయ జ్ఞానాన్ని పెంచే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ విద్యార్థులంతా రాసే విధంగా ప్రోత్సహించాలని అన్నారు. జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఈవో సోమశేఖరశర్మ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర బాధ్యులు నాగేశ్వరరావు, మోహన్, రామారావు, శివ నారాయణ, రాఘవయ్య, ఎలీవరెడ్డి, డాన్‌బాస్కో, లింగమూర్తి, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 18 : స్థానిక బాలల సదనాన్ని శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శించారు. సత్తుపల్లి సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న కే కావ్యకు ల్యాప్‌టాప్ అందజేశారు. ఖాళీ ప్రదేశం మొత్తం లెవల్ చేసి, పిల్లలకు జారుడుబండ, బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా సంక్షేమ అధికారి కే రాంగోపాల్‌రెడ్డి, బాలల పరిరక్షణ అధికారి టీ విష్ణువందనతోపాటు పర్యవేక్షకురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి
ఎమ్మెల్యే మట్టా రాగమయి

రైతులకు మోటర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, అక్టోబర్18: రైతులు వ్యవసాయం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. శుక్రవారం మండలంలోని రుద్రాక్షపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ పరిధిలోని సత్తెనపేట, బాసారం, కొమ్ముగూడెం, రుద్రాక్షపల్లి గ్రామాల్లో ఐటీడీ ద్వారా బోర్లు వేసుకున్న ఎస్సీ, బీసీ, ఓసీ రైతులకు సింగరేణి సహకారంతో రూ.75 లక్షల విలువ గల 30 మోటర్లను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఐటీడీఏ మోటర్లు ఇచ్చినప్పటికీ అవి సరిగా పనిచేయక పోవడంతో సింగరేణి సహకారంతో ఈ మోటర్లు అందజేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగరేణి పీవో నర్సింహారావు, ఎంపీడీవో నాగేశ్వరరావు, స్పెషలాఫీసర్ శ్రీధర్, సెక్రటరీ సురేశ్‌రెడ్డి, నాయకులు భరత్‌కుమార్, నాగజ్యోతి, భూపతి రెడ్డి, దామోదరరావు, అర్జున్, వెంకటేశ్వరరావు, పర్సా వెంటకేశ్వరరావు, రామారావు, కృష్ణ, సత్యం, గోపి, పాషా, హరికృష్ణ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిటౌన్, అక్టోబర్18: సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయాన్ని శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే మట్టా రాగమయి సందర్శించారు. ఆమె మున్సిపల్ కార్యాలయ భవనంలోని అన్ని సెక్షన్ల రూంలను పరిశీలించారు. అనంతరం కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న సిబ్బందికి సంబంధించి రిజిష్టర్‌ను పరిశీలించి రిజిష్టర్‌ను సక్రమంగా ఎందుకు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్లు మందపాటి పద్మజ్యోతి, రాంబాబు, మౌలాలి, కాంగ్రెస్ నాయకులు గాదె చెన్నారావు తదితరులు ఉన్నారు.

అత్తింటి ఎదుట కోడలి నిరసన

అత్తగారి ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న కోడలు

మామిళ్లగూడెం, అక్టోబర్ 18: న్యాయం కోసం అత్తింటి ఎదుట కోడలు నిరసన వ్యక్తం చేసిన ఘటన ఖమ్మం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ముదిగొండ మండలం, పండ్రేగుపల్లి గ్రామానికి చెందిన షేక్ జరీనాకు నగరంలోని సుందరయ్యనగర్, ఓల్డ్ ఎఫ్ సీఐ గోడౌన్స్ ప్రాంతానికి చెందిన షరీఫ్‌తో 2020 జనవరిలో వివాహమైంది. వారికి కుమార్తె జన్మించింది. వైరల్ ఫీవర్‌తో తన భర్త 2022 ఆగస్టులో మృతిచెందగా ఆరునెలలపాటు మంచిగానే చూసుకున్న అత్తమామలు కాలక్రమేణ వేధించడం ప్రారంభించారని ఆరోపించింది. వివాహ సమయంలో పుట్టింటి వారు ఇచ్చిన 10 లక్షల నగదు, 10 తులాల బంగారం, వెండి ఆభరణాలు, ఇంటి సామానులు ఉంచుకుని తనను బయటకు పంపించేశారని ఆవేదన వ్యక్తం చేసింది. అధికారులు, పోలీసులు తనకు న్యాయం చేయాలని కోరింది.

ఉమ్మడి జిల్లా టీటీ ఎంపికలు

ఖమ్మం సిటీ, అక్టోబర్ 18 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 విభాగంలో ఉమ్మడి జిల్లా టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు శుక్రవారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగాయి. వాటిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి వాసిరెడ్డి నరేష్‌కుమార్ ప్రారంభించారు. పోటీలకు దాదాపు 100 మంది బాల, బాలికలు హాజరవగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టీటీ అసోసియేషన్ కార్యదర్శి సాంబమూర్తి, వివిధ క్రీడల నిర్వాహకులు, కోచ్‌లు ప్రేమ్ నిరంజన్, మహ్మద్ మతిన్ పాల్గొన్నారు.

అండర్-17లో ఎంపికైన బాలురు

పరిటాల జ్వలిత్, ఎస్‌కే ఫయాజ్, జీ చార్విక్, ఆర్ రామ్‌సాకేత్, హితేష్ శ్రీరంగ, సీహెచ్ కేతన్ సాయి(స్టాండింగ్), ఎండీ ఆనస్ (స్టాండింగ్), పీ మోహిత్ కృష్ణ (స్టాండింగ్)

అండర్-17లో ఎంపికైన బాలికలు

- పీ వనశిక, బీ సాయి శివాని, జీ చంద్రికరాణి, ఏ ప్రవస్వ, జీ సిరి, కే నవ్య, ఎం ధరణి, బీ అఖిల, కే స్పందనచంద్ర .

20న అండర్-14 ఖోఖో పోటీలు

ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో అండర్-14 ఖోఖో జిల్లా స్థాయి ఎంపికలను ఈ నెల 20వ తేదీన నిర్వహిస్తున్నామని ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు కేఎన్ మూర్తి, వాసిరెడ్డి నరేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా బాలబాలికలు మాత్రమే హాజరుకావాలని, ఎంపికైన వారిని ఈ నెల 28 నుంచి కామారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు.

హార్వెస్ట్ విద్యార్థిని ప్రతిభ

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 18 : ఇండియన్ ఎన్‌జీఓ అవార్డు కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి వెబ్‌డిజైనింగ్ అండ్ కోడింగ్ పోటీల్లో నగరంలోని హార్వెస్ట్ పాఠశాల విద్యార్థిని షణ్ముకప్రియ ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ రామసహాయం పార్వతిరెడ్డి తెలిపారు. తెలంగాణ నుంచి మొదటిస్థానం సాధించినందున విద్యార్థినిని కరస్పాండెంట్ పోపూరి రవిమారుత్ అభినందించారు.

క్రికెట్ విజేత ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్

ఖమ్మం సిటీ, అక్టోబర్ 18 : ఉమ్మడి ఖమ్మంజిల్లా క్రికెట్ పోటీల్లో నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. గత రెండురోజుల నుంచి స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల(అటానమస్)తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో 156 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కవిత కాలేజీ జట్టు 98 పరుగులు మాత్రమే సాధించి ఓటమి పాలైంది. ఇరు జట్లకు ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణారావు ట్రోఫీలను అందజేశారు.

మోసం చేసిన వారిపై కేసు నమోదు

మామిళ్లగూడెం, అక్టోబర్ 18 : ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన ఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు. శుక్రవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. ఖమ్మంరూరల్ మండలం, గుర్రాలపాడు గ్రామానికి చెందిన కొట్టె దిలీప్, మరో ముగ్గురు వ్యక్తులకు బి.లక్ష్మణ్, లీలాబాయి అనే వారు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని 3లక్షల రూపాయలు వసూలు చేశారు. అనంతరం ఫేక్ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు బాధితులకు జారీ చేశారు. వాటిని తీసుకున్న వారు ఉద్యోగంలో చేరేందుకు ప్రయత్నించగా నకిలీ పత్రాలని తెలడంతో మోసపోయామని గుర్తించి డబ్బులు తీసుకున్న వారిని నిలదీశారు. వారు ఇప్పిస్తామని నమ్మిస్తుండడంతో విసుగుచెందిన బాధితులు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఫిర్యాదు స్వీకరించిన సీఐ బాలకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొణిజర్ల, అక్టోబర్ 18: మండలంలోని తనికెళ్లకు చెందిన చల్లా శివరాం ద్విచక్ర వాహనంపై వస్తూ రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివరాం ద్విచక్ర వాహనంపై తనికెళ్ల నుంచి వైరా వైపు వస్తుండగా పల్లిపాడు సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి జారి రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రున్ని 108లో ఖమ్మం తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య యశోద, పిల్లలు ప్రియ, కార్తీక్ ఉన్నారు.

21న డీసెట్ ధ్రువపత్రాల పరిశీలన

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 18 : డీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఈ నెల 21వ తేదీన ధ్రువపత్రాల పరిశీలన నగరంలోని డైట్ కళాశాలలో నిర్వహించనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు వెబ్‌ఆప్షన్స్ ఎంపిక చేసుకోవచ్చని పేర్కొన్నారు.

నేడు ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ

ఖమ్మం సిటీ, అక్టోబర్ 18 : ఇటీవల అకాల మరణం పొందిన హక్కుల నేత, ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ శనివారం సాయంత్రం ఖమ్మం జడ్పీ సమావేశ మందిరంలో జరుగనున్నది. ఈ మేరకు శుక్రవారం ప్రత్యామ్నాయ పౌరసమాజం(సీసీఏ) ప్రతినిధులు డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ యల మంచిలి రవీంద్రనాథ్, విద్యా- సామాజికవేత్తలు రవిమారుత్, కాకి భాస్కర్ తెలిపారు. 'సాయిబాబాను గుర్తు చేసుకుందాం- మన దుఃఖాలను కలబోసుకుందాం' అనే శీర్షికతో కరపత్రాల నగరంలో రిలీజ్ చేశారు.

'నూతన విద్యావిధానం రద్దు కోసం ఉద్యమిస్తాం'

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 18 : జాతీయ నూతన విద్యావిధానం రద్దు కోసం విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ కోరారు. శుక్రవారం నగరంలోని గిరిప్రసాద్‌భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ నేడు దేశంలో నూతన విద్యావిధానం పేరుతో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. శివనాయక్, వంశీ, రాకేష్, ప్రతాప్, సునిల్, రోహిత్, నరేష్, గోపి, సాయి వెంకటేష్ పాల్గొన్నారు.

రాయితీ నిధులను వెంటనే చెల్లించాలి

మాట్లాడుతున్న ఉప్పల వెంకటరమణ

మామిళ్లగూడెం, అక్టోబర్ 18 : గ్రానైట్ పరిశ్రమలను ఆదుకోవాలని, రాయితీ నిధులను వెంటనే చెల్లించాలని ఖమ్మం గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నూతనంగా ఎన్నికైన కార్యవర్గసభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు పాటిబండ్ల యుగేంధర్, ప్రధాన కార్యదర్శి కమర్తపు గోపాల్‌రావు, కోశాధికారి మారంరెడ్డి పరమేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ, తమ్మినేని సాగర్, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

ఆధునిక నైపుణ్య కేంద్రాల్లో సీట్ల భర్తీకి చర్యలు చేపట్టాలి

వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్ శ్రీజ

మామిళ్లగూడెం, అక్టోబర్ 18 : మారుతున్న కాలానుగుణంగా ప్రస్తుత ఉద్యోగ అవసరాల మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక నైపుణ్యకేంద్రాలుగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా కొత్త ట్రేడ్లు అందుబాటులోకి తెస్తున్నామని, వాటిలో సీట్ల భర్తీకి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర కార్మికశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సంజయ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి జిల్లా స్థానికసంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఐటీఐలలో ఆరు ట్రేడ్లకు సంబంధించి 172 సీట్లు ఉన్నాయని, ఇప్పటికే 60 సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. మిగతా సీట్ల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కాన్ఫరెన్సులో జిల్లా కార్మిక సహాయ కమిషనర్ కృష్ణవేణి, సహాయ కార్మిక అధికారులు వెంగమ్మ, రమేష్‌చందర్ పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు : సీపీ

మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మం సిటీ, అక్టోబర్ 18 : ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ హెచ్చరించారు. శుక్రవారం ఖమ్మం గవర్నమెంట్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు ఆహ్వానం మేరకు కాలేజీకి వెళ్లిన ఆయన స్థానికంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ర్యాగింగ్ పట్ల అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ స్నేహభావంతో మెలగాలని, చదువుపై మాత్రమే దృష్టి సారించి ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. యాంటీ ర్యాగింగ్ కమిటీ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌తో అన్నారు.

గులాబీరంగు పురుగును పరిశీలించిన ఏడీఏ

రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సరిత

కూసుమంచి, అక్టోబర్ 18: కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ సహాయ సంచాలకురాలు (ఏడీఏ) శుక్రవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పత్తి పంటను పరిశీలించారు. పలు ప్రాంతాల్లో పత్తి పంటను గులాబీరంగు పురుగు ఆశించినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. గులాబీ రంగు పురుగును వెంటనే నివారించపోతే పంటకు తీవ్ర నష్ట కలిగిస్తుందని అన్నారు. అందుకని వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం చౌటపల్లి గ్రామంలోని పలువురి రైతులతో మాట్లాడి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఏఈవో మానస, రైతులు పాల్గొన్నారు.

'ఏఎంసీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి'

ఖమ్మం రూరల్, అక్టోబర్ 18: వ్యవసాయ మార్కెట్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మద్దులపల్లి ఏఎంసీ చైర్మన్ బైరు హరినాథబాబు కోరారు. ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్ రోడ్డులోని మద్దులపల్లి మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏఎంసీ తొలి పాలకవర్గం సమావేశం శుక్రవారం జరిగింది. ఇటీవలి ప్రమాణ స్వీకారం అనంతరం చైర్మన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మార్కెట్ నిర్మాణ పనులపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. వైస్ చైర్మన్ వనవాసం నరేందర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులతోపాటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం తప్పనిసరి'

ఖమ్మం రూరల్, అక్టోబర్ 18: గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉంటేనే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత పేర్కొన్నారు. ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్‌రోడ్‌లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.

వరిలో తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలి: ఏవో

కూసుమంచి, అక్టోబర్ 18: వరి పంటలపై ఆశిస్తున్న